ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 29 జనవరి 2024



ఇంటర్ ఫీజు చెల్లింపునకు మరో అవకాశం

అనంతపురం విద్య, జనవరి 28: పలు కారణాలతో ఇంటర్మీడియేట్ పరీక్షల ఫీజు చెల్లించలేని విద్యార్థుల కోసం తత్కాల్ ద్వారా ఫీజు చెల్లించడానికి మరో అవకాశం ఉందని ఆర్ఐఓ సురేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. రూ. 3 వేల అపరాధ రుసుంతో సోమవారం సాయంత్రం 5 గంటలలోగా చెల్లించవచ్చునన్నారు. ఫీజు చెల్లించని ఇంటర్ రెగ్యులర్, ప్రైవేట్, జనరల్, ఒకేషనల్ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకూ ఫీజు చెల్లించని విద్యార్థులు వెంటనే ఫీజు చెల్లించేలా కళాశాలల ప్రిన్సిపాళ్లు చర్యలు తీసుకోవాలని ఆ ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

అనంతపురం రూరల్: విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై సోమవారం నుంచి నాలుగు రోజులపాటు వర్చువల్ పద్ధతిలో ప్రజాభిప్రాయాలను సేకరిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అనంతపురంనగరం, రూరల్, కదిరి, కళ్యాణదుర్గం, గుత్తి, హిందూపురం డివిజన్ కార్యాలయాల నుంచి వినియోగదారులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అలాగే మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.




రామగిరి జయహో బీసీ సదస్సులో పాల్గొన్న పరిటాల సునీత

దాడులు చేసిన ఏ ఒక్కరినీ వదలం

మాజీ మంత్రి పరిటాల సునీత హెచ్చరిక

రామగిరి, జనవరి 28: బీసీలపై దాడులు చేసి.. ఇబ్బందులకు గురిచేసిన ఏ ఒక్కరినీ తాము అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టే ప్రసక్తేలేదని మాజీ మంత్రి పరిటాల సునీత హెచ్చరించారు. బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది తెలుగుదేశం పార్టీనేనని స్పష్టం చేశారు. రామగిరిలో ఆదివారం తెలుగుదేశం పార్టీ బీసీ విభాగంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి పరిటాల సునీతకు బీసీ నాయకులు, మండల టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బడుగు బలహీన వర్గాలు పడుతున్న అవమానాలను అడ్డుకోవడానికే ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. ఈ ప్రాంతంలో పేద వర్గాలు ముఖ్యంగా బీసీలు పడుతున్న ఇబ్బందులను చూసి ఆ రోజుల్లో పరిటాల రవీంద్రను ఎన్టీఆర్ రాజకీయాల్లోకి తీసుకువచ్చారన్నారు. బీసీలకు అండగా నిలబడి వారిని ముందుండి నడిపించిన నాయకుడు పరిటాల రవి అన్నారు. ఆ తరువాత బీసీలకు ప్రాధాన్యం ఇచ్చి ఎంతో మందిని చట్టసభలకు తీసుకెళ్లిన ఘనత చంద్రబాబు, నారాలోకేశ్‌కే దక్కుతుందన్నారు. ఈ ఐదేళ్లకాలంలో వైసీపీ బీసీలకు ఏమి చేసిందని ప్రశ్నించారు. కొందరు నాయకులకు మాత్రమే పదవులు ఇచ్చి.. వారికి అధికారాలు లేకుండా ఓ సామాజిక వర్గం నేతలు గుప్పెట్లో పెట్టుకున్నారన్నారు. మంత్రులైనా.. ఎమ్మెల్యేలైనా... వారికి అధికారాలు లేకుండా చేశారన్నారు. బీసీలను తెరముందు ఉంచి వెనుక కథ నడిపించేదంతా జగన్‌రెడ్డి వర్గీయులేనని ఆరోపించారు. బీసీలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పారే కానీ... వాటికి ఒక్క పైసా కూడా ఇచ్చారా? అని నిలదీశారు. రాప్తాడు నియోజకవర్గంలో బీసీలపై చాలా దాడులు చేశారని, అక్ర మ కేసులు బనాయించారని అన్నారు. పోలీసుస్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లితే రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు లంచాలు తీసుకుంటున్నారన్నారు. చెన్నేకొత్తపల్లి మండల సాక్షి విలేకరి మద్యం బాటిళ్లు తీసుకువస్తూ పోలీసులకు పట్టుబడ్డాడని, అయితే ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడికట్లు పూజారి ఇంటి వద్ద మద్యం బాటిళ్లు ఉంచి ఆయనపై కేసుపెట్టాలని ప్రయత్నించడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. అదే అధికార పార్టీకి చెందిన విలేకరి దొరికితే మీరు స్పందించరా? అంటూ నిలదీశారు. ప్రకాశ్‌రెడ్డి సోదరులు వారి స్వార్థం కోసం తగదాలను వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనకు వస్తున్న జనాన్ని చూస్తుంటే చంద్రన్న విజయం ఖాయమైందన్నారు. ఓటరు జాబితాపై పూర్తిగా దృష్టి పెట్టి దొంగ ఓట్లు, డబుల్ ఓట్లు, స్థానికేతరులకు ఓట్లు ఉంటే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, కురుబ సంఘం సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట రమణ, వడ్డెర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవి, యాదవ సంఘం నాయకుడు పరందామ యాదవ్, రాష్ట్ర కుమ్మర సంఘం అధ్యక్షుడు పోతలయ్య, సర్పంచ్‌లు గంగమ్మ, లలితమ్మ, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, పేపర్ శీన, మాదాపురం శంకర్, అక్కులప్ప, శ్రీరాములు నాయక్, సుబ్బరాయుడు, గుర్రం శీన, మురళి, శివ కుమార్, గంగిరెడ్డి, సుకన్య పాల్గొన్నారు.



సాగులోకి తెచ్చుకున్న భూములు

- అక్రమంగా సాగుచేస్తున్న వైసీపీ నాయకులు
- మామూళ్లు, డిన్నర్ల మత్తులో అటవీ అధికారులు
- లోకాయుక్తకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైన పందికుంట గ్రామస్థులు

అటవీ భూమి ఆక్రమణ

వందల ఎకరాల్లో చెట్ల నరికివేత

విడపనకల్లు మండలంలోని పందికుంట అటవీ ప్రాంతంపై కొందరు వైసీపీ నాయకుల కన్ను పడింది. ముఖ్య నాయకులు అందరూ ఏకమై దాన్ని ఆక్రమించేందుకు సిద్ధం అయ్యారు. వజ్రకరూరు మండలంలోని భద్రంపల్లి ప్రాజెక్టు పరిధిలో దాదాపుగా 2వేల ఎకరాలకు పైగా అటవీ ప్రాంతం ఉంది. పందికుంట సర్వే నంబరు 334బీలో కూడా మరో రెండు వేల ఎకరాలకు పైగా అటవీ ప్రాంతం ఉంది. ఇక్కడ వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన జంతువులను వదిలి పెడుతూ ఉంటారు. ఈ అడవిని సంరక్షించేందుకు అటవీ శాఖ సిబ్బందిని సైతం నియమించింది. అయితే కొంత మంది వైసీపీ నేతలు ఈ అటవీ భూమిపై కన్నేసి, అటవీ శాఖ అధికారులకు డిన్నర్లు, మామూళ్లను ఎరగా చూపి అడవిలోని చెట్లను తొలగించి వందల ఎకరాలు ఆక్రమించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- విడపనకల్లు, (వజ్రకరూరు)



అటవీ ప్రాంతంలో చెట్లను నరికి కాల్చేస్తున్న దృశ్యం

మండలంలోని పందికుంట తండా, వెంకటాంపల్లి పెద్దతండా, పందికుంట గ్రామాల్లోని కొందరు నేతలు ట్రైబల్ చట్టాన్ని అడ్డు పెట్టుకుని అటవీ భూమిని ఒక్కొక్కరు దాదాపుగా 40 ఎకరాల నుంచి 50 ఎకరాలు ఆక్రమించి సాగు చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో బోర్లు వేసుకున్నా, విద్యుత్ స్తంభాలు నాటినా అటవీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంపై కొందరు గత ఏడాది ట్రైబల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ట్రైబల్ అధికారి అన్నేయ్‌దొర భద్రంపల్లి ప్రాజెక్ట్ అటవీ ప్రాంతాన్ని పరిశీలించి కొంత మంది రైతులతో చర్చించారు. భూమి లేని వారికి, అర్హతలు కలిగిన వారికి పట్టాలు ఇచ్చేందుకు అనుమతులు ఇచ్చారు. అక్రమంగా ఎవరైనా 10 ఎకరాలకు పైగా సాగులో ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

ఒక్కొక్కరు 40 ఎకరాల నుంచి 50 ఎకరాలు



సొంతంగా హద్దులు ఏర్పాటు చేసుకున్న ఆక్రమణ దారులు

ఎకరాకు రూ.40 వేలు వసూలు

ఆక్రమించిన భూమిని పేదలకు ఇచ్చేందుకు ఎకరాకు రూ. 40వేలు ప్రకారం వసూలు చేస్తున్నట్లు వజ్రకరూరు మండలంలో బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మండలానికి చెందిన ఇద్దరు నాయకులు ఒక్కొక్కరు 40 ఎకరాల నుంచి 50ఎకరాలు ఆక్రమించినట్లు సమాచారం. అలాగే కొనకొండ్ల పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగి తన భార్య పేరు మీద దాదాపు 40 ఎకరాలు సాగు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. మరి కొంత మంది వందల ఎకరాలు ఆక్రమించుకుని అటవీ ప్రాంతాన్ని నాశనం చేస్తున్నా అటవీ శాఖ అధికారులు కళ్లు మూసుకున్నారనే విమర్శలు వినవస్తున్నా యి. కాగా టీడీపీ సానుభూతిపరుడు ఐదు ఎకరాలు సాగు చేసుకుంటుంటే, అతడికి పట్టా చేయించేందుకు రూ.25వేలు తీసుకున్నట్లు సమాచారం. దీనికి తోడు ఆ భూమి అటవీ భూమి అని దాన్ని ఖాళీ చేయాలని అటవీ అధికారులు తీవ్రంగా ఒత్తిడి పెంచినట్లు సమాచారం.

అధికారులకు డిన్నర్లతో మచ్చిక

వైసీపీ నాయకులు వందల ఎకరాలు ఆక్రమించుకుని సాగు చేస్తున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడానికి డిన్నర్లే కారణమనే విమర్శలు వినవస్తున్నాయి. వెంకటంపల్లి చిన్నతండా, ఎస్ఎస్‌పీ తండాలలో వైసీపీ నాయకులు కొందరు నాటు కోళ్లు, పొట్టేళ్లను కోసి అటవీ శాఖ అధికారులకు డిన్నర్లు ఇచ్చినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. అందుకే దాదాపుగా నాలుగు వందల ఎకరాలకు పైగా అటవీ ప్రాంతాన్ని(చెట్లను నరికి) ఆక్రమించున్నా ఎవరూ పట్టించుకోలేదనే ఆరోపణల వినిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని లోకాయుక్తకు ఫిర్యాదు చేసేందుకు పందికుంట గ్రామానికి చెందిన కొందరు సిద్ధం అయినట్లు ప్రచారం జరుగుతోంది.

మా దృష్టికి రాలేదు

అటవీ భూములు ఆక్రమించిన విషయం మా దృష్టికి రాలేదు. ఆక్రమణలు జరిగి ఉంటే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- సతీష్, బీట్ ఆఫీసర్

జేసీ కుటుంబానికి రెండు సీట్లు ఖాయం

యువచైతన్య బస్సుయాత్ర ముగింపు సభలో జేసీపీఆర్

తాడిపత్రి, జనవరి 28: రాబోయే ఎన్నికల్లో టీడీపీ తరఫున జేసీ కుటుంబం నుంచి ఇరువురు అభ్యర్థులు పోటీచేస్తారని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పెద్దవడుగూరు మండలంలో ఆదివారం యువచైతన్య బస్సుయాత్ర ముగింపు సందర్భంగా విలేకరులతో జేసీ మాట్లాడారు. టీడీపీలో ఒకే కుటుంబానికి ఒకే టికెట్ అన్న నిబంధన జేసీ కుటుంబానికి వర్తించదన్నారు. తమది సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబమన్నారు. అనంతపురం పార్లమెంట్‌తో పాటు తాడిపత్రి అసెంబ్లీ టికెట్ తరఫున జేసీ పవన్‌రెడ్డి, జేసీ అశ్మిత్‌రెడ్డి పోటీచేస్తారన్నారు. అనంతపురం పార్లమెంట్ మొదటి నుంచి ఓసీకి చెందిన అభ్యర్థులే పోటీచేస్తూ గెలుస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఇరువురు మాత్రమే బీసీ అభ్యర్థులు గెలుపొందారన్నారు. అనంతపురం పార్లమెంట్ ఓసీ నియోజకవర్గమేనని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రభావం ఈ ఎన్నికల్లో ఉండదన్నారు. 2029 ఎన్నికల్లో కొంతమేర ప్రభావం ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు ప్రజలు బ్రహ్మరథం పడతారన్నారు. యువచైతన్య యాత్రకు పెద్దఎత్తున జనాలు హాజరయ్యారని అత్యధికంగా మహిళలు ఉన్నారన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రిలో విజయం సాధిస్తాం: జేసీ అశ్మిత్‌రెడ్డి

రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పొత్తుతో తాడిపత్రి నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేస్తుందని ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. యువచైతన్య బస్సుయాత్ర ముగింపులో భాగంగా జరిగిన ర్యాలీలో జేసీ అశ్మిత్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దవడుగూరు మండలం నాలుగున్నరేళ్లలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. రోడ్లు, కాలువలు, ఇతర మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండలంలో యువచైతన్య బస్సుయాత్రలో తాము గుర్తించిన సమస్యలన్నింటిని అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాలుగున్నర ఏళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలు వైసీపీ పాలనతో విసిగిపోయారని టీడీపీని గెలిపించేందుకు ఆసక్తితో ఉన్నారని తెలిపారు.



కళ్యాణదుర్గం పట్టణంలో వేలిముద్రలు వేయించుకుంటున్న వలంటీరు

సందేహాల గణన..!

- వ్యక్తిగత వివరాలపైనా అనేక ప్రశ్నలు
- చెప్పేందుకు జంకుతున్న సామాన్యులు
- సర్వర్ సమస్యతో వలంటీర్ల తంటాలు

కులమే కాదు.. ఆస్తిపాస్తుల వివరాల సేకరణ



కళ్యాణదుర్గంలో అరుగు మీద కూర్చుని సర్వర్ కోసం వేచి చూస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

జిల్లాలో కుల గణన సర్వే గందరగోళంగా సాగుతోంది. పేరుకు కులగణనే అయినా.. అందులో ఆస్తిపాస్తులు, వ్యక్తిగత వివరాలపై ప్రశ్నలు ఉండటంతో జనంలో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ నెల 19 నుంచి జిల్లాలో కులగణన జరుగుతోంది. క్షేత్ర స్థాయిలో 28వ తేదీకల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అనంతరం సచివాలయ పరిధిలో మరో ఐదు రోజులపాటు సర్వే ప్రక్రియ కొనసాగుతుంది. క్షేత్రస్థాయిలో ఈ పనిని వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అప్పగించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేయాల్సిన ఈ పనిలో వలంటీర్లను భాగస్వాములను చేయడం గమనార్హం. ఎన్నికలు సమీపిస్తున్న వేళ, అదీ కూడా తక్కువ వ్యవధిలో హడావుడిగా కులగణన సర్వే చేయాల్సిన అవసరం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇది ఒక ఎత్తయితే, సర్వేలో కులాలతో సంబంధం లేని ప్రశ్నలు వేస్తున్నారని జనం అంటున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గవ్యాప్తంగా రెండు లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. నిబంధనల ప్రకారం ఒక్కో సచివాలయ పరిధిలో 20 మంది వలంటీర్లు ఉండాలి. ప్రస్తుతం 13 నుంచి 15 మందిలోపే ఉన్నారు. ఒక్కో వలంటీరు 90 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. సర్వర్‌సమస్యతో సర్వేలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సర్వర్ సమస్య పట్టిపీడిస్తుండటంతో ఎక్కడా పూర్తిస్థాయిలో జరగడం లేదు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక ఉన్నారు. దీంతో ఒకటి, రెండు రోజులు సర్వర్ సమస్యతో అలాగే గడిచిపోయాయి. -

-కళ్యాణదుర్గం

అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నవారు తరచుగా మారుతుంటారు. ఇలాంటి కుటుంబాలు ప్రతి సచివాలయం పరిధిలో 10 నుంచి 15 వరకు ఉంటాయి. వీరు ఉన్నది ఒకచోట కాగా.. మ్యాపింగ్ (వలంటీరు దగ్గర) మరోప్రాంతంలో ఉంటుంది. దీంతో ఎవరు ఎక్కడున్నారో తెలియక వలంటీర్లు ఇబ్బంది పడుతున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వలంటీరు దగ్గర మ్యాపింగ్ చేయించుకుంటే, గతంలో ఉన్న వలంటీర్

● మ్యాపింగ్ మాయం

లాగిన్‌లో ఆ వివరాలు పోతాయి. అద్దె ఇళ్లకు మారినవారు స్థానికంగా లేరు. ఇతర ప్రాంతాల్లో మ్యాపింగ్ కాకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. చాలా కుటుంబాలు సర్వేకు దూరమవుతున్నారు. వారిని వెతికి పట్టుకుని మ్యాపింగ్ చేయించి సర్వే చేయాల్సి ఉంది. ఉన్న కొద్దిరోజుల్లో ఇది సాధ్యమయ్యే పనికాదు. సర్వే సమయంలో కుటుంబాలు అందుబాటులో లేకుంటే ఫిబ్రవరి 2 వరకు మరో తమ పరిధిలోని సచివాలయాలకు వెళ్లి కులగణన సర్వే చేయించుకోవాలని వలంటీర్లు క్షేత్రస్థాయిలో చెబుతున్నారు.

● సతాయిస్తున్న సర్వర్

కులగణన సర్వేలో ఎన్యూమరేటర్లుగా వలంటీర్లు, సూపర్‌వైజర్లుగా సచివాలయ ఉద్యోగులు వ్యవహరిస్తున్నారు. తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి యాప్‌లో కుటుంబ వివరాలు నమోదు చేయాల్సి ఉంది. వలంటీర్లు తమ సెల్‌ఫోన్లల్లో జీఎస్‌డబ్ల్యూఎస్ అనే యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. ఇంటి యజమాని వేలిముద్ర తీసుకుని, వలంటీరుతో పాటు సచివాలయ ఉద్యోగి బయోమెట్రిక్ వేస్తేనే యాప్ తెరుచుకుంటుంది. సర్వే పూర్తి చేసేందుకు ఒక్కో ఇంటి వద్ద 30 నుంచి 45 నిమిషాలు పడుతోంది. వలంటీరు, కుటుంబ యజమాని, సచివాలయ ఉద్యోగి.. ఈ ముగ్గురూ కలిసి రెండుసార్లు ఈ-కేవైసీ (వేలిముద్రలు) పూర్తివేస్తేనే ఆ కుటుంబ కులగణన పూర్తయినట్లు. ఒక్కో సభ్యుడి వద్ద వివరాలు సేకరించే సమయంలోనే సాంకేతిక సమస్యలు రావడంతో నమోదు చేసిన వివరాలు డిలీట్ అవుతున్నాయి. మళ్లీ మొదటి నుంచి నమోదు చేయాల్సి వస్తోంది. ఎవరికైనా వేలిముద్రలు పడకపోతే ఐరిస్, ఓటీపీ ద్వారా కూడా యాప్ ఓపెన్ చేయొచ్చు. ఏ ప్రక్రియలోనూ యాప్ తెరుచుకోకపోవడంతో ఇళ్ల వద్ద సిగ్నళ్ల కోసం తంటాలు పడుతున్నారు. ఉదయం 8 నుంచి 10 గంటలలోపు మాత్రమే యాప్ పని చేస్తోందని, ఆ తర్వాత ఎర్రర్ కోడ్ పదేపదే వస్తోందని అంటున్నారు. ఈ కారణంగా ఉదయం పది గంటల తరువాత సర్వేను చాలాచోట్ల ఆపేస్తున్నారు.

● వీరి పరిస్థితి ఏమిటి..?



బీసీ - సీ కింద క్రిస్టియన్లు ఉన్నారు. కులాల విభాగంలో బీసీ-సీ దగ్గర క్రిస్టియన్లు అన్న సమాచారం లేదు. యాప్‌లో క్రిస్టియన్ అని టైప్ చేసినా తీసుకోవడం లేదు. మతం విభాగం వద్ద హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, ఇతరులు, మతం లేనివారు అని ఉంది. ఉప కులం దగ్గర క్రిస్టియన్ అన్న ఆప్షన్ లేదు. ఇదో పెద్ద సమస్యగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, సంపన్నవర్గాలకు రేషన్‌కార్డులు లేవు. కుల గణన సర్వేలో రేషన్‌కార్డు నంబరు నమోదు చేయాల్సి ఉంది. కార్డు లేకపోతే నంబరు ఎలా నమోదు చేయాలో తెలియక వలంటీర్లు తలలు పట్టుకుంటున్నారు. ఏవైనా పొరపాట్లు చేసి ఉంటే వాటిని సవరించుకునేందుకు ఆప్షన్ లేకపోవడం, ఇంటి విషయంలో పూరిల్లు, గుడిసెలు, ఆర్‌సీసీ, డూప్లెక్సుల్లో నివాసమున్నారా అని ప్రశ్నలు ఉన్నాయి. కానీ అది అద్దె ఇల్లా, సొంతమా అన్న ఆప్షన్ లేదు.



స్థిర, చరాస్తుల వివరాలు చెప్పాలట..

కులగణన యాప్‌లోని సెక్షన్-1లో వ్యక్తికి సంబంధించిన ప్రస్తుత జీవన స్థితి, చిరునామా వివరాలు నమోదు చేస్తారు. కుటుంబంలో ఎంతమంది ఉన్నారో, అంతమంది నుంచి అన్ని ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేయాల్సిందే. స్థిర, చరాస్తుల వివరాలతో పాటు కోళ్లు, పందులు, మేకలు, గొర్రెలు, పశువుల లెక్క.. ఇలా 18 సమాధానాలు నింపాల్సి వస్తోంది. రేషన్‌కార్డు సంఖ్య, నివాసం ఉంటున్న ఇంటి రకం (పూరి గుడిసె, పెంకుటిల్లు, ఆర్‌సీసీ బిల్డింగ్, డూప్లెక్స్ తదితరాలు), మరుగుదొడ్ల సదుపాయం, తాగునీరు, గ్యాస్ సదుపాయం ఉందా లేదా నమోదు చేస్తున్నారు. ఈ వివరాలు చెప్పడానికి జనం జంకుతున్నారు. సెక్షన్-2లో కుటుంబ వివరాలు నమోదవుతాయి. ఇందులో పుట్టిన తేదీ, వివాహ స్థితి, కులం, ఉప కులం, మతం, విద్యార్హత, వృత్తి, పంట భూమి, నివాస భూమి వివరాలు నమోదు చేస్తున్నారు. అయా వివరాలను బహిరంగ పరిచేందుకు పలువురు వెనుకాడుతున్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

అనంతపురం విద్య, జనవరి 28: స్థానిక ఆర్ట్స్ కాలేజ్‌లో ఆదివారం నిర్వహించిన ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు చిన్నపాటి మంజుల, రాష్ట్ర కార్యదర్శి నరసింహులు ఆధ్వర్యంలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాయల్ వెంకటేష్, ప్రధానకార్యదర్శిగా సిరాజుద్దీన్, ఉపాధ్యక్షులుగా నాగరాజు, మోహన్‌రెడ్డి, బొమ్మయ్య, పాపిరెడ్డి, గాయత్రి, సతీష్‌ను ఎన్నుకున్నారు. మంజుల మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ గురువారం కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి అనంతలో షార్జా ప్రతినిధుల పర్యటన

అనంతపురం అర్బన్, జనవరి 28: షార్జా ప్రతినిధి బృందం సోమ, మంగళవారాల్లో జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ ప్రకటనలో పేర్కొన్నారు. షార్జా రాజు కుటుంబీకుల్లో ఒకరైన షేక్ మజీద్, శ్రీలంకకు చెందిన సర్వోదయ ఉపాధ్యక్షుడు వాల్టర్ లింక్, దుబాయికి చెందిన మరో ప్రతినిధి జిల్లాలో పర్యటిస్తారన్నారు. సోమవారం రాప్తాడు మండలంలోని మరూరు, బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పంటలు పరిశీలిస్తారన్నారు.





నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు



చంద్రబాబు బస చేసిన శిబిరం వద్ద కాలవ, సునీత



చంద్రబాబుకు అభివాదం చేస్తున్న పరిటాల సునీత



హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు వీడ్కోలు పలికేందుకు వచ్చిన టీడీపీ నేతలు

ఘనంగా చంద్రబాబుకు వీడ్కోలు

అనంతపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఆ పార్టీ జిల్లా ముఖ్య నేతలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఉరవకొండ నియోజకవర్గ కేంద్రంలో రా.. కదలిరా బహిరంగ సభ ముగిసిన అనంతరం ఆయన ఆ వేదిక సమీపంలోనే శనివారం రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేసిన రా.. కదలిరా బహిరంగ సభకు వెళ్లేందుకు బయలుదేరారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, జోన్-5 పార్టీ పరిశీలకులు బీద రవిచంద్రయాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, పల్లె రఘునాథరెడ్డి, పరిటాల సునీత, పీఏసీ చైర్మన్, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరి, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వర నాయుడు, శింగనమల టూమెన్ కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, ఆ నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణిశ్రీ, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, జోన్-5 మీడియా కో-ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయల్ మురళీ, తెలుగు యువత రాష్ట్ర నాయకులు గుడిపూటి నారాయణస్వామి, సీనియర్ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, పురుషోత్తంనాయుడు, గాండ్ల విశాలాక్షి, పెరుమాళ్ల జీవానందరెడ్డి తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా సభ: ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ఉరవకొండ: రా కదలిరా కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయేలా జరిగిందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రా కదలిరా కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. యావత్తు ప్రభుత్వాన్ని ఉపయోగించి సీఎంకు వచ్చిన జనం కంటే చంద్రబాబు బహిరంగసభకు ఐదు రెట్లు జనం ఎక్కువగా వచ్చారన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఎంత ఉందో సభను బట్టి అర్థమవుతోందన్నారు. సభ విజయవంతం కావడానికి శ్రమించిన టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీపై నమ్మకంతో ప్రజానీకం స్పందించి తరలివచ్చారన్నారు. దీంతో టీడీపీపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. టీడీపీని గెలిపిస్తున్నామన్న సందేశాన్ని ప్రజలు ఇచ్చారన్నారు.

ప్రైవేటు స్కూల్‌లో అరాచకం...!

బార్‌ను తలపిస్తున్న స్కూల్ ఆవరణ

మద్యం మత్తులో విద్యార్థులను చితకబాదిన హాస్టల్ ఇన్‌చార్జి

మండిపడిన విద్యార్థి సంఘాలు



మందు బాటిళ్లను పరిశీలిస్తున్న నాయకులు



వీపుపై వాతలను చూపుతున్న విద్యార్థి

అనంతపురం విద్య, జనవరి 28: నగరశివారులోని సంసిద్ధ్ స్కూల్‌లో అరాచకం సాగుతోందని, హాస్టల్ ఇన్‌చార్జ్ విజయ్ శంకర్ మద్యం సేవించి విద్యార్థులను చితకబాదుతున్నారంటూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఇతర నాయకులు రమణయ్య, మంజు, హరి, భీమేష్, సోము ఆ స్కూల్‌లో జరుగుతున్న అరాచకాలపై ఆందోళన వ్యక్తం చేశారు. స్కూల్ హాస్టల్ బిల్డింగ్‌లో కుప్పలు తెప్పలుగా నిల్వ ఉంచిన ఖాళీ మద్యం బాటిళ్లను బహిర్గతం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హాస్టల్ ఇన్‌చార్జ్ విజయ్‌శంకర్ గత కొన్ని నెలలుగా మద్యం సేవించి 10వ తరగతి విద్యార్థులను నిత్యం చితకబాదుతున్నాడన్నారు. అయినా స్కూల్ యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే స్కూల్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజుకు సమాచారం ఇవ్వగా ఆయన ఆ స్కూల్ ఎక్కడంటూ తమనే ప్రశ్నించే స్థితిలో ఉన్నారంటూ వివరించారు. డిప్యూటీ డీఈఓ శ్రీనివాస్‌రావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేశారు. తనిఖీ అనంతరం ఆంధ్రజ్యోతి ఆయనకు ఫోన్ చేయగా పలువురు విద్యార్థులపై వాతలున్నాయన్నారు. సుమారు 30 మంది వరకూ దెబ్బలు తిన్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌ను ఆరా తీయ్యగా ఆసుపత్రిలో ఉన్నానని, తనకు విషయం తెలియదని చెబుతోందని, దీంతో డీఈఓ కూడా మాట్లాడించానని స్పష్టం చేశారు. హాస్టల్ వార్డెన్ పరారీలో ఉన్నాడని, ఈ సంఘటనపై విచారణ తర్వాత సమగ్రమైన నివేదికను డీఈఓకు ఇస్తానని పేర్కొన్నారు. అయితే సంసిద్ధ్ స్కూల్ ఘటనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

బాధ్యత ఎవరిది..?

ఓటర్ల తుదిజాబితా తప్పుల తడకే

మృతులు, స్థానికేతరులకూ ఓటు యథాతథం


అనంతపురం టౌన్ జనవరి 28: తుదిఓటర్ల జాబితాలో ఎక్కడా పారదర్శకత కనిపించడంలేదు. చనిపోయినవారి ఓట్లు అలాగే ఉండిపోయాయి. డబుల్ ఎంట్రీ, స్థానికేతరుల ఓట్లు జాబితాలో ఉన్నాయి. మరోవైపు ఓటర్ల జాబితా ముద్రణలోనూ ఫొటోలు ఒకరివి ఉండగా పేర్లు మరొకరివి ఉన్నాయి. దీనికి బాధ్యత ఎవరిది అన్న ప్రశ్న తలెత్తుతోంది. అనంతపురంరూరల్ మండల పరిధిలోని కొడిమి, మన్నీల, రాచానపల్లి గ్రామాల్లో మృతిచెందినవారి ఓట్లూ అలాగే ఉంచారు. డబుల్ ఎంట్రీ ఓట్లు, బయటవ్యక్తుల పేర్లతో ఓట్లను జాబితాలో అలాగే ఉంచడం కనిపిస్తోంది. రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాళ్ మండల పరిధిలోని కానాపురం, ఏళంజి గ్రామాల్లో చనిపోయిన వారి ఓట్లు జాబితాలో అలాగే ఉంచారు. గుంతకల్ మున్సిపాలిటీలో మరణించిన వారిఓట్లు, స్థానికేతరుల ఓట్లు పెద్దఎత్తున బయటపడ్డాయి. ఇక్కడ ఓటర్ల జాబితా అంతా తప్పులు తడకగా రూపొందించారన్న విమర్శలు వస్తున్నాయి. ఇక రాప్తాడు నియోజకవర్గంలోని రాప్తాడు, కనగానపల్లి, ఆత్మకూరు మండలాల్లో కుప్పలు తెప్పలుగా చనిపోయినోళ్లఓట్లు, స్థానికేతరుల ఓట్లు, డబుల్‌ఎంట్రీ ఓటర్లు బయటపడ్డాయి. అనంతపురం రాంనగర్‌కు చెందిన ఓ మహిళా కార్పొరేటర్ పేరు ఆత్మకూరు మండలం తోపుదుర్తిలో ఓటరుగా ఉంచారు. ఇక అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో అనేక వింతలు దర్శనమిస్తున్నాయి. రామచంద్రనగర్, ఆర్‌కేనగర్, నీరుగంటివీధి, రాంనగర్, లక్ష్మీనగర్, వేణుగేపాల్‌నగర్‌లలో ఫొటోలు ఒకరివి పేర్లు మరికరివి ముద్రించారు. డబుల్‌ఎంట్రీ ఓటర్లు, స్థానికేతరుల ఓటర్లు ప్రతి డివిజన్‌లోనూ లెక్కలేకుండా ఉన్నారు.

ఓటర్ల తుదిజాబితా విడుదల చేస్తూ కలెక్టర్ ఏమన్నారంటే..

జిల్లాలో కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు అందాయి. లక్షల్లో రావడంతో సమయం సరిపోక పూర్తిస్థాయి విచారణ చేయలేకపోయాం. అందుకే గత ఏడాది అక్టోబరులో విడుదల చేసి న ముసాయిదా ఓటర్ల జాబితాలో ఆ పొరపాట్లు, సమస్యలు అలాగే ఉండిపోయాయి, ఇదే విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాం. కొన్ని పత్రికలు ఆ తప్పులను చూపుతూ కనీసం మా సమాధానం తీసుకోకుండా పదేపదే కథనాలు రాసాయి. ఇపుడు తుది ఓటర్ల జాబితాలో ఆ సమస్య ఉండదు. ఫిర్యాదులను పక్కాగా పరిశీలించి ఓటర్ల తుదిజాబితాను పారదర్శకంగా తయారుచేసి ప్రకటిస్తున్నాం.

జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితే

అనంతపురం జిల్లాకు సంబంధించి తుదిఓటరు జాబితాలో 19,94,544మంది ఉన్నట్లు కలెక్టర్ గౌతమి అధికారికంగా వెల్లడించారు. జాబితా విడుదల చేసిన తర్వాత రాజకీయ పార్టీల నాయకులు ఓటర్ల జాబితాపై దృష్టిపెట్టారు. ఆది నుంచి అధికార వైసీపీ నాయకులు దొంగ ఓట్లను నమోదు చేయించారని, అధికారులు సైతం వారి ఒత్తిళ్లకు తలొగ్గి చేశారన్న ఆరోపణలు పెద్దఎత్తున వచ్చాయి. ప్రతిపక్ష టీడీపీ ఆధారాలతో జిల్లా, రాష్ట్ర, కేంద్ర ఎన్నికల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే తప్పులను సవరించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఓటర్ల తుదిజాబితానే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గం గ్రామం ఇలా అన్ని జాబితాల్లోనూ ఓటర్ల జాబితాలో తప్పులు వెలుగులోకి వస్తున్నాయి.



పుట్లూరులో ఒకే ఇంటి నంబరుతో ఏడుగురు వేర్వేరు కులాలకు చెందిన వారి ఓట్లు నమోదైన దృశ్యం

బాధ్యులు ఎవరు..?

తుది ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలని ఎన్నికల కమిషన్ ఉన్నతాదికారులు పదేపదే హెచ్చరిస్తూ వచ్చారు. ఏ చిన్న తప్పు జరిగినా చర్యలు తప్పవని పేర్కొన్నారు. పరిశీలకులు ఐఏఎస్ మురళీధర్‌రెడ్డి కలెక్టరేట్‌లో సమీక్ష చేపట్టి స్వయంగా ఆరాతీసారు, తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందిస్తున్నామని వెల్లడించారు. కలెక్టరు గౌతమి సైతం ఇదే విషయాన్ని చెప్పారు. తీరా చూస్తే తుదిజాబితా తప్పులు తడకగానే కనిపిస్తోంది. బీఎల్‌ఓల నిర్లక్ష్యమా..? కావాలనే ఇలా తుదిజాబితా తయారుచేశారా..? అన్నది అంతుబట్టని విషయంగా మారింది. దీనికి బాధ్యులు ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది.

పెండింగ్ ఫిర్యాదుల సంగతేంటి..?


జిల్లాలో తుది ఓటర్ల జాబితా ఇచ్చినా జిల్లావ్యాప్తంగా ఇంకా 15,905 ఫిర్యాదుల పరిశీలన పెండింగ్‌లో ఉన్నాయి. ఇదేవిషయాన్ని కలెక్టరు జాబితా విడుదల చేసేరోజు తెలిపారు. ఇందులో7361 ఫారం-6 ఉండగా 5424ఫారం-7 ఉన్నాయి. అదేవిధంగా 3120పారం-8 ఉన్నాయి. వీటిని పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హులను ఓటర్ల జాబితాలో చేరుస్తామని కలెక్టరు అన్నారు. ఇపుడు ఇచ్చిన ఓటర్ల జాబితానే తప్పుల తడకగా ఉంది ఇక ఈపెండింగ్ ఫిర్యాదులను ఏమి చేస్తారోనన్న అభిప్రాయం ఓటర్లలో వ్యక్తమవుతోంది.

'తుది'లోనూ అవే తప్పులు

శింగనమల: ఓటర్ల తుది జాబితానూ అవే తప్పులున్నాయి. ఇంటింటా పకడ్బందీగా నిర్వహించిన సర్వేలో ఓటర్ల జాబితాలో ట్రిబుల్, డబుల్ ఎంట్రీలు ఉన్నట్లు వెలుగుచూసిన విషయం తెల్సిందే. వాటిని సరిచేశామని అధికారులు వెల్లడించినా తుది జాబితాలో తప్పులు అలాగే ఉన్నాయి. శింగనమల 85 పోలింగ్ బూత్‌లో సీరియల్ నెంబర్ 61, 666 కొప్పెర్ల శ్రావణి, తండ్రిపేరు పార్థసారథిరెడ్డి వరుస నెంబర్‌లోనే డబుల్ ఎంట్రీలు చేశారు. అలాగే అదే బూత్‌లోనే సీరియర్ నెంబర్ 61, 667లో కొప్పెర్ల పవన్‌కుమార్‌రెడ్డి, తండ్రి పేరు కొప్పెర్ల పార్థసారథిరెడ్డి పేరు మీద డబుల్ ఎంట్రీలు ఉన్నాయి. బూత్ నెంబర్ 84లో సీరియల్ నంబర్ 1023, 1130లో మంగళ నాగేంద్ర తండ్రి పేరు మంగళ చితంబరప్పతో డబుల్ ఎంట్రీలు చేశారు. మండలంలో ఇలా చాలా డబుల్ ఎంట్రీలు ఉన్నాయి. అంతేకాకుండా మరణించిన వారి ఓట్లను కూడా తొలగించలేదన్న విమర్శలున్నాయి.



శింగనమలలో బూత్ నంబర్ 85లో ట్రిబుల్ ఎంట్రీలు




డబుల్ ఎంట్రీ ఓట్లు

మృతులకూ ఓటు హక్కు!

పెద్దవడుగూరు, జనవరి 28: ఓటరు తుదిజాబితాలో మృతిచెందిన వారి ఓట్లను సైతం తొలగించకపోవడం విమర్శలకు తావిస్తోంది. మండలకేంద్రంలోని హనుమంతరెడ్డి ఓటరు ఐడీ జీవీఎల్1851971, అతడి భార్య కమలమ్మ ఐఎఫ్‌హెచ్ 1974468 మృతిచెందారు. అయినా వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి తుదిజాబితా తయారుచేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఇలా తప్పులతడకగా ఓటరు జాబితా తయారైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ముసాయిదాకు, తుది జాబితాకు వ్యత్యాసమేదీ?

యాడికి, జనవరి 28: మండలంలోని వేములపాడు గ్రామానికి చెందిన ఓటరు తుది జాబితాలో మృతి చెందిన వారి ఓట్లు కూడా తొలగించలేదు. ముసాయిదా ఓటరు జాబితాకు, తుది జాబితాకు వ్యత్యాసం లేదు. వేములపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని వేములపాడు, కొట్టాలపల్లి, తిమ్మాపురం, వీ. పెండేకల్లు గ్రామాల్లో 2200మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 220మంది ఓటర్లు మృతులు, గ్రామం విడిచి వెళ్లిన వారే ఉన్నారు. 10శాతం ఓట్లు వీరివే ఉన్నాయి. ముసాయిదా ఓటరు జాబితా సమయంలోనే వీటిని తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు సరిగా పనిచేయకపోవడం వల్లే ముసాయిదా ఓటరు జాబితాకు, తుది జాబితాకు వ్యత్యాసం లేకుండా పోయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



తుది జాబితాలో తొలగించని మృతుల ఓట్లు



వేములపాడులో తుది జాబితాలోనూ తొలగించని మృతుల ఓట్లు, గ్రామంలో లేనివారి ఓట్లు

ఒకే ఇంటి నంబరులో మూడు కులాల ఓట్లు


పుట్లూరు, జనవరి 28: మండలంలో ఓటర్ల జాబితా తప్పుల తడకగా వచ్చింది. నూతన జాబితాలో కూడా ఒకే ఇంటి నంబరులో మూడు కులాల ఓట్లతోపాటు మరణించిన వారి ఓట్లు తొలగించలేదు. కొండుగారికుంట గ్రామంలో ఇంటి నెంబర్ 1-91లో బీసీ, ఎస్సీ, ముస్లింల ఓట్లు ఉన్నాయి. వరుస నెంబర్ 420, 421, 422, 423, 424, 425, 426వరకు ఇంటినెంబర్ 1-91 పేరిట ఏడుగురు ఎస్సీ, బీసీ, ముస్లిం ఓటర్లు ఉన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా ఇంకా ఎప్పుడు సక్రమంగా సవరిస్తారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మళ్లీ అవే తప్పులు ..

ధర్మవరం: పట్టణంలోని తుదిజాబితాలో అధికార పార్టీ సానుభూతిపరుల ఓట్లు డబుల్‌ఎంట్రీలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా మృతిచెందిన వారి ఓట్లు కూడా అలాగే ఉన్నాయి. వేరొక మండలంలో నివసిస్తున్న వారి ఓట్లు దర్శనమిస్తున్నాయి. 25వ వార్డులోని జాబితాలో ప్రతాప్‌రెడ్డి పేరు మీద 225వ, 226వ పోలింగ్ బూత్‌లలోని డబుల్‌ఎంట్రీలు ఉన్నాయి. 227పోలింగ్ బూత్‌లో సంజీవరెడ్డి ఓటు రెండు చోట్ల ఉంది. మృతిచెందిన శంకరయ్య పేరును అలాగే ఉంచారు. గ్రీష్మా సానే వివాహమై మూడేళ్లక్రితమే వెళ్లిపోయినా ఆమె పేరు 226వ పోలింగ్ బూత్‌లో అలాగే ఉంది. అదేవిధంగా చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామంలో నివాసం ఉంటున్న సంకాల లక్ష్మీదేవి, సంకల చిన్నవెంకటరాముడు పేర్లు పట్టణంలోని 225 పోలింగ్ బూత్‌లో ఉన్నాయి.



డబుల్ ఎంట్రీగా ఉన్న ప్రతాప్‌రెడ్డి, సంజీవరెడ్డి, గ్రీష్మ సానే ఓట్లు



225వ పోలింగ్‌బూత్‌లో ఉన్న మేడాపురం గ్రామానికి చెందిన సంకాల లక్ష్మీదేవి, సంకాల చిన్నవెంకటరాముడి పేర్లు

ప్రతి ఇంటి తలుపు తట్టాలి

కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించాలి

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



షర్మిలతో కరచాలనం కోసం ఎగబడుతున్న కార్యకర్తలు

అనంతపురం న్యూటౌన్, జనవరి 28: నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటి తలుపు తట్టాలని కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సూచించారు. నగరంలోని లలితకళాపరిషత్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి హాజరైన షర్మిల మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి వారసురాలిగా పుట్టింటికి రావడం జరిగిందన్నారు. రాజశేఖర్‌రెడ్డికి ఏపీ, తెలంగాణా రెండు కళ్లు లాంటివని పేర్కొన్నారు. ఏపీ ప్రజలు కష్టాల్లో ఉన్నారని, కొంతవరకైనా వారి సమస్యలను తీర్చగలనన్న నమ్మకంతో వచ్చానన్నారు. తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, దేనికీ భయపడేదిలేదన్నారు. రాష్ట్ర ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాడతానన్నారు. అనంతపురం జిల్లా అంటే వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఎనలేని అభిమానమన్నారు. రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో 1000 గ్రామాలకు, 17 మునిసిపాలిటీలకు తాగునీటి కొరత తీర్చిన ఘనత రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రజలకు జగనన్న ఏమి చేశారని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో అతడికి ఎందుకు ఓటు వేయాలన్నారు. వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై ఇచ్చేవారని, ప్రస్తుతం సబ్సిడీ అనే పదమే లేకుండా పోయిందన్నారు. దీనిపై జగనన్న ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కరువు జిల్లాను ఆదుకోవడానికి ప్రాజెక్ట్ అనంతను జిల్లాకు తీసుకురావడం జరిగిందని, తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ, వైసీపీ లు ప్రాజెక్ట్ గురించి పట్టించుకోక గాలికి వదిలివేయడం జరిగిందన్నారు. ఇది నా పుట్టినిల్లు అని, ఇక్కడ ప్రజలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. ప్రజల హక్కులను హరిస్తున్నారని, వాటిని కాపాడటానికి వైఎస్ఆర్ వారసురాలిగా పోరాటం చేయడానికి వచ్చానన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీనీ జగనన్న నెరవేరలేదన్నారు. ప్రతి ఏడాది జనవరి 1న జాబ్ క్యాలెండర్ అన్న జగనన్న ఆ మాటను నిలుపుకోలేకపోయాడన్నారు. ఎన్ని జాబ్‌క్యాలెండర్లు విడుదల చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మన ఆడబిడ్డగా రాష్ట్ర ప్రజల అభివృద్ధిని కాంక్షిస్తూ వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగించేలా షర్మిల మన ముందుకు రావడం జరిగిందని మాజీ మంత్రి రఘువీరారెడ్డి అన్నారు. ఆమె అడుగుజాడల్లో ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త పయనించి కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని సూచించారు. షర్మిల పిలుపు మేరకు మండల, గ్రామస్థాయిల్లో పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ద్వారానే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. ప్రాంతీయ పార్టీలకు ఓటు వేస్తే బీజేపీకి ఓటు వేసినట్టేనన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుతోపాటు సీనియర్ నాయకులు జేడీ శీలం, కొప్పులరాజు, పలంరాజు, జంగా గౌతమ్, సుధాకర్, దాదాగాంధీ, శంకర్, ప్రతాప్ రెడ్డి, శ్రీధర్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుమునుపు షర్మిలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. గజమాలతో ఆమెను సన్మానించారు.

ఆర్యవైశ్యులది ఘనమైన చరిత్ర

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్

ఘనంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారోత్సవ సభ



అభివాదం చేస్తున్న ఆర్యవైశ్యులు

అనంతపురం కల్చరల్, జనవరి 28: సమాజంలో ఆర్యవైశ్యుల చరిత్ర ఎంతో ఘనమైనదని మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభను ఆదివారం జిల్లా కేంద్రంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సభకు టీజీ వెంకటేష్‌తోపాటు ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు, మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, సీనియర్ రాష్ట్ర నాయకుడు పోతుల సురేష్, పొలిటికల్ కమిటీ చైర్మన్ కోటా సత్యం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అంతకుముందు పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం నుంచి బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఇదే సమయంలో టీజీ వెంకటేష్‌కు గజమాలతో సత్కారం చేశారు. అనంతరం ఫంక్షన్‌హాల్‌లో నూతన కార్యవర్గం ముఖ్యఅతిథుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసింది. టీజీ వెంకటేష్ మాట్లాడుతూ థార్ ఎడారి తర్వాత అంతటి దుర్భర పరిస్థితుల్లో అనంతపురం జిల్లా వాతావరణం కనిపిస్తుందన్నారు. రాయలసీమ హక్కుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలో విస్తృతంగా పోరాటాలు సాగించడం జరిగిందని, భవిష్యత్‌లోనూ పోరాటాలు సాగిస్తామన్నారు. రాష్ట్రంలో బీసీలతోపాటు వైశ్యులనూ ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరముందన్నారు. రానున్న శాసనసభ, రాజ్యసభ ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు 5 నుంచి 10 సీట్లు కేటాయించాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడుగా సిరిగుప్ప వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడిగా కలవల రామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పోతుల మనోజ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులు, కోశాధికారిగా కర్ణాటక సత్యరంగయ్య, అదనపు కార్యదర్శులుగా సత్రసాల మంజునాథ్, సుంకు రమేష్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా వంకదారు జయలక్ష్మి తదితర కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు జీవీ రామయ్య, కల్లూరు నాగరాజు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా కన్వీనర్ తిరువీధుల జగదీష్‌కుమార్, కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు, పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, వైశ్య హాస్టల్ అధ్యక్షుడు ఆదిశేషయ్య, అవోపా జిల్లా అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ మల్లికార్జున, చంద్రమహేష్ పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 28: వర్షాభావం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లావ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ తెలిపారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు ప్రకటించిన రూ. 251 కోట్ల పంటనష్టపరిహారాన్ని సంక్రాంతి పండుగ నాటికి రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని చెప్పి, ఇంతవరకూ ఒక్క రూపాయి కూడా జమ చేయలేదని విమర్శించారు. ఈనెల 23న జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి పంట నష్టపరిహారం గురించి ఏమీ మాట్లాడకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. సోమవారం జిల్లాలోని అన్ని మండల తహసీల్దార్ కార్యాలయ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాల్లో రైతులు, కూలీలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, సావిత్రి, శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు తరిమెల నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, భాస్కర్, రామిరెడ్డి, మన్నీల రామాంజనేయులు, నిర్మల, వెంకటనారాయణ, ముస్కిన్, శివశంకర్, పోతులయ్య, చెన్నారెడ్డి, నాగేంద్ర, సాకే నాగరాజు, పరమేష్, బాలకృష్ణ, ముర్తుజా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంభూపాల్

రేపు జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, జనవరి 28: స్థానిక కోర్టు రోడ్డులోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్ట్ లాజిస్టిక్స్, జోయలక్కాస్ సంస్థల్లో డెలివరీ ఎగ్జిక్యూటివ్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సేల్స్ ట్రైనీస్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఇంటర్మీడియేట్, డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులని, ఆసక్తిగల అభ్యర్థులు ఈ మేళాకు వారి బయోడేటాతో హాజరు కావాలని సూచించారు.

పెద్దన్నకు ఘన నివాళి

అనంతపురం కల్చరల్/క్లాక్‌టవర్, జనవరి 28: స్థానిక రజక నగర్‌లో సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కమిటీ సభ్యుడు పెద్దన్న సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ఇందులో ఆయన చిత్ర పటానికి పలువురు నివాళులర్పించారు. సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకురాలు ఝాన్సీ మాట్లాడుతూ.. పెద్దన్న పేదల కోసం అనేక కాలనీలు నిర్మించారని, శ్రామిక ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకోవడమే ధ్యేయంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, ప్రసాదన్న, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిషోర్‌బాబు, తరిమెల అమర్నాథరెడ్డి పాల్గొన్నారు.

4న టెన్త్ విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం పరీక్ష



ప్రజ్ఞా వికాసం పరీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 28: విద్యావేత్త, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లావ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ తెలిపారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఆ పరీక్షల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ పరీక్షల్లో మొదటి 10మంది విజేతలకు ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జిల్లాలోని ప్రధాన పట్టణాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వైటీసీ రమేష్, సిద్దు, వంశి, గిరి, రజిత, జిల్లా సహాయ కార్యదర్శులు సూర్యప్రకాష్, అశోక్, భీమేష్, ఎస్కేయూ వంశీ, సోము పాల్గొన్నారు.

శిలువ నమూనాపై జగన్ నడవడం బాధాకరం

టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్



అనంతపురం అర్బన్, జనవరి 28: భీమిలి సభలో సీఎం జగన్ శిలువ నమూనాపై నడవడం బాధాకర మని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి దాస్ మండిపడ్డారు. ఆదివారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. క్రీస్తుపూర్వం ఏసుప్రభు పాపుల కోసం, జనం కోసం శిలువనెక్కి మరణించాడని, అలాంటి శిలువ గుర్తుపై సీఎం నడిచి క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీశాడని అన్నారు. రాబోవు ఎన్నికల్లో క్రిస్టియన్లు అంతా ఏకమై వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు.

జూదరుల అరెస్టు

అనంతపురం క్రైం, జనవరి 28: అనంతపురం రూరల్ మండలం పాములాయి సమీపంలోని కంపచెట్లలో ఆదివారం రాత్రి జూదమాడుతున్న 16 మందిని అరెస్టు చేసినట్లు సీఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.71,290 స్వాధీనం చేసుకున్నామన్నారు.

టీడీపీ, జనసేన కలయిక చారిత్రక అవసరం: కాలవ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ

కణేకల్లు, జనవరి 28: రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న సైకో జగన్‌ను ఇంటికి సాగనంపడానికి టీడీపీ, జనసేన కలయిక చారిత్రాత్మక అవసర మని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అభిప్రాయ పడ్డారు. మండల కేంద్రంలో ఆదివారం జనసేన పార్టీ నూతన కార్యాలయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంజునాథ్ గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమావేశంలో కాలవ మాట్లాడుతూ జగన్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభ మైందని, గద్దె దిగడానికి మరో 72 రోజులు మాత్రమే గడువు మిగిలి ఉందన్నారు. ప్రజాతీర్పును ముందుగానే అర్థం చేసుకున్న జగన్ తాను ముఖ్యమంత్రి సీటు నుండి దిగిపోవడానికి సిద్ధంగా ఉన్నట్లు ఈ మధ్య ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడ న్నారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని తాను సీఎం అయినప్పటి నుంచి ప్రతిపక్షాలను అణగదొక్కడ మే లక్ష్యంగా పెట్టుకుని ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాడని దుయ్యబట్టారు. త్వరలో ఏర్పాటయ్యే టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ద్వారా జగన్‌కు చక్రవడ్డీతో రిటర్న్ గిఫ్ట్ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నా రు. ఇన్ని రోజులు సంపాదించిన సొమ్ముతో విదేశాలకు కూడా వెళ్లిపో వడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన ఆరోపించారు. ఇప్పటికే యుద్ధం ప్రారంభమైందని టీడీపీ, జనసేన పార్టీలు బాధ్యతగా పనిచేసి వైసీపీ రహిత ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాకపోతే ఈ రాష్ట్రాన్ని ఎవరూ కాపాడలేరని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన గుంతకల్లు ఇన్‌చార్జ్ మణికంఠ, స్థానిక టీడీపీ నాయకులు లాలెప్ప, జనసేన కన్వీనర్ రవి, రాము, ఆనంద్, బీటీ రమేష్, కోళకుర్తి సుదర్శన, వేలూరి మరియప్ప, మాబుసాబ్, షేక్‌ముజ్జు, చాంద్‌బాషా, కురుబ నాగరాజు, మారుతి, బాయినేని నవీన్, సలీమ్ పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

కుందుర్పి, జనవరి 28: మండలంలోని బండమీదపల్లి గ్రామానికి చెంది న మణెమ్మ (38) పాము కాటుతో ఆదివారం మృతి చెందింది. మణెమ్మ కుటుంబం చిన్న వ్యాపారం చేస్తూ జీవించేది. తన ఇంట్లోనే పాముకాటుకు గురికావడంతో కుందుర్పి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు. అక్కడ పాటు కాటుకు టీకాలు లేకపోవడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, భర్త ఉన్నారు.

మామిడి మొక్కలపై యాసిడ్

పెద్దవడుగూరు : మండలంలోని వీరన్నపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రెడ్డప్ప సాగుచేసిన ఏడాది వయస్సుగల 120 మామిడిమొక్కలపై విషపు యాసిడ్ పోయడంతో ఎండిపోయాయి. ఇదే గ్రామానికి చెందిన గోపాలు, వెంకటస్వామి, లక్ష్మీదేవి ఈ చర్యకు పాల్పడినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు.

ప్రజాధనం 'రోడ్డు' పాలు

- కేటాయించింది ఓ చోట.. పనులు చేసింది మరోచోట
- తన పొలాలకు రహదారి వేయించుకున్న వైసీపీ నేత



ఉల్లికల్లు గ్రామంలో వైసీపీ నేత పొలాలకు వేసిన రోడ్డు



ఉల్లికల్లు నుంచి ఇరువెందల ఎస్సీ కాలనీ వరకు రోడ్డు వేసినట్లు ఏర్పాటు చేసిన బోర్డు

శింగనమల, జనవరి 28: మండలంలో ప్రజానిధులు దుర్వినియోగ మయ్యాయి. ఉల్లికల్లు గ్రామం నుంచి ఇరువెందల ఎస్సీ కాలనీ వరకు రోడ్డు నిర్మాణానికి ఎంపీ నిధుల కింద రూ.10 లక్షలు మంజూరైంది. అయితే గ్రామ సర్పంచ్ భర్త, వైసీపీ నాయకుడు ఆ నిధులతో తన పొలాలకు మట్టి రోడ్డు వేయించుకున్నట్లు సమాచారం. గతంలో ఆ మట్టి రోడ్డుకు రైతులు చందాలు వేసుకొని మట్టిని వేయించుకున్నారు. అయితే ఇటీవల ఉల్లికల్లు గ్రామానికి రోడ్డు పనులకు రూ.10 లక్షలు మంజూరైంది. ఆ నిధులతో ఆ వైసీపీ నేత మళ్లీ ఆ రోడ్డుకే మట్టి తోలించినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై పీఆర్ జేఈకి ఫోన్‌లో సంప్రదించడానికి యత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

వైసీపీకి ఓటమి ఖాయం

మాజీ మంత్రి పరిటాల సునీత



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల సునీత

రామగిరి, జనవరి 28: వైసీపీ ప్రభుత్వంతో ప్రజలంతా విసిగిపోయారని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమి ఖాయమని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం గ్యారెంటీ అన్ని మాజీ మంత్రి పరిటాల సునీత ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం మండలంలోని నసనకోట పంచాయతీలోని గంగంపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆమె గ్రామస్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ మిని మ్యానిఫెస్టో పథకాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో కొందరికే సంక్షేమాన్ని అందించి.. మరికొందరికి అన్యాయం చేసిందన్నారు. ఈ రాష్ట్రాన్ని ఎవరూ కాపాడలేని పరిస్థితికి తీసుకెళ్లారన్నారు. గతంలో సీఎం జగన్ జిల్లాకు వచ్చినప్పుడు బటన్ నొక్కి ఇన్సురెన్స్ ఇస్తామన్నారే కానీ.. ఖాతాలోకి మాత్రం డబ్బులు పడలేదన్నారు. ఇప్పుడు ఆసరా పేరుతో ఉరవకొండలో బటన్ నొక్కి వెళ్లారని... కానీ మహిళల ఖాతాలోకి డబ్బులు పడలేదని అన్నారు. ఇలా మోసం చేస్తున్న ప్రభుత్వానికి తగిన విధంగా బుద్ధిచెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్మూర్తి నాయుడు, నాయకులు శ్రీధర్ నాయుడు, పోతన్న, గంగాధర్, శ్రీనివాసులు, అనిల్‌కుమార్, శ్రీనివాసులు, ఆదినారాయణ పాల్గొన్నారు.

అన్నివర్గాలనూ కలుపుకుని పనిచేస్తా

జనసేన నాయకుడు కాయగూరల లక్ష్మీపతి



లక్ష్మీపతిని సన్మానిస్తున్న ముస్లిం, మైనార్టీ నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 28: 'నిబద్ధత, చిత్తశుద్ధి కలిగిన పవన్‌కళ్యాణ్ సారథ్యంలో జనసేన పార్టీలో చేరడం గర్వం గా ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ... ప్రతి ఒక్కవర్గాన్ని కలుపుకొని జనసేనలో క్రియాశీ లకంగా పనిచేస్తా' అని ఆ పార్టీ నాయకుడు కాయగూరల లక్ష్మీపతి అన్నారు. జనసేన లోకి చేరిన సందర్భంగా ఆయన్ను ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం పలువురు ముస్లిం, మైనార్టీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ... క్రమ శిక్షణ కలిగిన పార్టీ కార్యకర్తగా జనసేన బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. వచ్చే 2024 ఎన్నికల్లో అనంతపురం అర్బన్ టికెట్ జనసేన పార్టీకి కేటాయించాలని పవన్ కళ్యాణ్‌ను కోరానన్నారు. ఆ మేరకు టికెట్‌ను కేటాయిస్తే క్షేత్రస్థాయిలో అన్ని వర్గాలను కలుపుకొనిపోయి పార్టీని గెలిపించుకుంటామని అన్నారు. ముస్లిం, మైనార్టీ నేతలు మాట్లాడుతూ.. జనసేన పార్టీలో లక్ష్మీపతి ఉన్నంత వరకూ తమ మద్ధతు ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎం వ్యవస్థాపకుడు మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో లక్ష్మీపతి చేరడం శుభపరిణామం : టీసీ వరుణ్

జనసేన పార్టీలోకి సీనియర్ నాయకులు కాయగూరల లక్ష్మీపతి చేరడం శుభపరిణామమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ అన్నారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన లక్ష్మీపతితో కలిసి మీడియాతో మాట్లాడారు. జనసేన అధ్యక్షు డు పవన్‌కళ్యాణ్ ఆశయసాధన కోసం అందర్నీ కలుపుకొని పని చేస్తామన్నారు. జనసేన నాయ కులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో టీడీపీతో కలిసి పనిచేయాలన్నారు. జగన్‌ను ఇంటికి పంపించడమే ధ్యేయంగా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త, వీర మహిళలు పనిచేయాలని సూచించారు. జనసేన, టీడీపీ ప్రభుత్వ స్థాపనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

సమావేశంలో నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, జయరాంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, నాయకులు కార్తికేయ, సంజీవరాయుడు, కిరణ్‌కుమార్, సిద్దు, జయమ్మ, విజయ్ కుమార్, ఆకుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జగన్.. హామీ నిలుపుకో..!

- ఎస్సీ జాబితాలో చేర్చాలి
- రజక సంఘ నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 28: తమను ఎస్సీ జాబితాలో చేర్చుతామని ఎన్నికల ముందు జగన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలుపుకోవాలని రజకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కృష్ణకళా మందిరం నుంచి టవర్‌క్లాక్, సుభాష్‌రోడ్డు, సప్తగిరిసర్కిల్ మీదుగా లలితకళా పరిషత్తు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం లలితకళ పరిషత్తులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ రజకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పొన్నాడ మోహన్‌రావు, వర్కింగ్ ఛైర్‌పర్సన్ పార్వతి, జాతీయ నాయకులు బొమ్మరాజు కృష్ణమూర్తి, జూపల్లి రాజశేఖర్, సెక్రటరీ జనరల్ కమ్మన్న మాట్లాడారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడం న్యాయమైన కోరిక అని, అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టేందుకు సీఎం జగన్ చొరవచూపాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రజకులకు రెండు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు ఇచ్చి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. రజక కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు నిధులు కేటాయించి, పనిముట్లు ఇవ్వాలన్నారు. రజకులకు కేటాయించిన వృత్తి పనులు ఇతరులకు కాకుండా రజకులతోనే భర్తీ చేయాలన్నారు. 50 ఏళ్ళు పైబడిన రజకులకు పెన్షన్, రజకుల రక్షణకు సమగ్ర చట్టం తీసుకురావాలన్నారు. రజక నేతలు అంజయ్య, పెద్దన్న, చంద్రశేఖర్ మృతికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి, జిల్లా రజక అభివృద్ధి సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్‌సీ నారాయణ స్వామి, రంగనాథ్, నాయకులు నరసింహ, గాంధీ, వెంకటేశం, సుబ్రమణ్యం, సాయి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

రైతులను ఆదుకోవాలి

నార్పల, జనవరి 28: నాసిరకం కలింగర విత్తనాలతో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బండ్లపల్లి గ్రామంలో నాసిరకం విత్తనాలతో నష్టపోయిన పంటలను వారు పరిశీలించారు. విత్తనాలు నాసిరకం కావడం వల్లనే రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వెంటనే అనంతపురంలో నాసిరకం విత్తనాలను ఇస్తున్న ఫర్టిలైజర్ షాపులను రద్దు చేసి, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

గార్లదిన్నె, జనవరి 28: సంతానం కలగలేదని జీవితంపై విరక్తి చెందిన గార్లదిన్నె మండలం పాపినేపాళ్యం వాసి బోయ సుబ్బరాయుడు భార్య బోయ క్రిష్ణవేణి (36) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వీరికి 18 సంవత్సరాల క్రితం వివాహమైంది. క్రిష్ణవేణి స్వగ్రామం గుత్తి మండలం అనగానిదొడ్డి. సుబ్బరాయుడు గార్లదిన్నె, అనంతపురం ప్రాంతాల్లో ప్లంబింగ్ పని చేస్తూ జీవనం సాగించేవారు. వీరికి సంతానం లేదు. సంతానం కోసం పలు ఆస్పత్రులు తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన క్రిష్ణవేణి ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అనంతరం గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె మృతదేహాన్ని పోలీసులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చంద్రబాబు వ్యాఖ్యలు హర్షణీయం

ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి శంకర్

అనంతపురం విద్య, జనవరి 28: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఉరవకొండ సభలో ఎస్సీ వర్గీకరణ ఆవశ్యకతను వివరించడం, మాదిగలకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం హర్షణీయమని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ సుప్రీంలో దాఖలు చేసిన పిటీషన్ పైన సుప్రీంలో విచారణ నడుస్తోందన్నారు. ఈ కేసులో టీడీపీ తరపున ఇన్‌ప్లీడ్ కావాలని ఆయన కోరారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందన్నారు. ఇటీవల తెలంగాణాలో మందకృష్ణ మాదిగ పాదయాత్ర, ప్రధాని మోదీ స్పందన నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ వేగవంతమైందన్నారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గూబ అధ్యక్షతన ఐదుగురు సభ్యులతో కేంద్రం కమిటీ వేసిందన్నారు. ఈ క్రమంలో టీడీపీ సైతం మాదిగలకు న్యాయం చేస్తామని చెబుతున్న కారణంగా.. సీనియర్ లాయర్‌ను ఏర్పాటు చేసి వర్గీకరణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగాధర్, జిల్లా అధ్యక్షులు రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేంద్ర, జిల్లా ప్రధానకార్యదర్శి అశోక్ కుమాంర్, కోశాధికారి పుల్లన్న ఇతర నేతలు హనుమంతరావు, శ్రీనివాసులు నాగభూషణ, నారాయణస్వామి పాల్గొన్నారు.

దళితుల ద్వేషి... సీఎం జగన్ : ఎమ్మార్పీఎస్

అనంతపురం సెంట్రల్, జనవరి 28: సీఎం జగన్‌రెడ్డి దళితుల ద్వేషి అని, ఆయన తన ఐదేళ్ల పాలనలో దళితపట్ల తీసుకున్న నిర్ణయాలు శాపంగా మారాయని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప మండిపడ్డారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి వెచ్చించాల్సిన సబ్‌ప్లాన్ నిధులు, కార్పొరేషన్స్ నిధులను దారిమళ్లించి అన్యాయం చేశారన్నారు. ప్రత్యేకంగా అందించాల్సిన పథకాలను నవరత్నాల్లో విలీనం చేసి మాయం చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల గురుకుల పాఠశాలలకు నిధులివ్వకుండా ఆ పాఠశాలల మనుగడను ప్రశ్నార్థంగా మార్చారన్నారు. ఉన్నతవిద్య నభ్యసిస్తున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇస్తున్న ఆర్థిక సాయాన్నీ ఎగ్గొడుతున్నారని వాపోయారు. ఇళ్లస్థలాల కేటాయింపు, గృహాల నిర్మాణాలు ఇలా అన్నివిధాలా మోసం చేస్తున్న జగన్‌కు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

ముగిసిన లఘుచిత్ర వారోత్సవాలు



విజేతలకు జ్ఞాపికలు అందిస్తున్న ప్రముఖులు

అనంతపురం కల్చరల్, జనవరి 28: అనంతపురం ఫిల్మ్ సొసైటీ, హైదరాబాద్‌కు చెందిన హెచ్‌డీ విజన్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరో అనంత లఘుచిత్ర వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. సాయంత్రం స్థానిక విద్యుత్ కళావేదికలో నిర్వహించిన ముగింపు సభలో జిల్లా అదనపు ఎస్పీ హనుమంతు మాట్లాడారు. ఇటీవలి కాలంలో జిల్లాకు చెందిన కళాకారులు సినిమాలు, సీరియళ్లు, లఘుచిత్రాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం లఘుచిత్ర వారోత్సవాల్లో ప్రదర్శించిన లఘుచిత్రాలకు సంబంధించి ఉత్తమ చిత్రం, ఉత్తమ డైరెక్టర్, హీరో, హీరోయిన్, విలన్, కెమెరామెన్, ఎడిటర్ విభాగాల్లో అవార్డులు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిస్కవర్ అనీల్‌కుమార్, డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, జీఎంఎస్ గ్యాలరీ సురేష్‌కుమార్, హొన్నూరప్ప, జాకీర్ హుస్సేన్, వీర నరసింహారెడ్డి, యాంకర్ రమేష్‌నీల్, కంబదూరి షేక్ నబిరసూల్ పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

అనంతపురంరూరల్, జనవరి 28: మండలంలోని అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిధిలోని పంచాయతీలో ఆడుదాం ఆంధ్రలో విజే తలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఆదివారం రుద్రంపేట పంచాయతీలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. రుద్రంపేట పంచా యతీ పరిధిలోని సచివాలయం పరిధిలోని క్రికెట్ జట్టు ద్వితీయ స్థానంలో నిలవగా.. రుద్రంపేట-1కు చెందిన క్రీడాకారుల జట్టు వాలీబాల్‌లో తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా వారికి మెమెంటోలు, మెడల్స్‌తో సత్కరించారు. ఈకార్యక్రమంలో ఏంపీపీ వరలక్ష్మి పాల్గొన్నారు.

కొనసాగిన సీనియర్ ఏపీఎల్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 28: స్థానిక అనంత క్రీడాగ్రామంలో సీనియర్ ఏపీఎల్ క్రికెట్ పోటీలు ఆదివారమూ కొనసాగాయి. ఈ పోటీల్లో మెడికల్ క్లబ్‌పై హిందూపురం యునైటెడ్ క్రికెట్ క్లబ్, డైనమిక్ క్రికెట్ క్లబ్‌పై జీఎన్‌జీ అనంతపూర్ జట్లు విజయం సాధించాయి. అంతకు ముందు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి మధు ఆచారి ఈ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి భీమలింగారెడ్డి, కోశాధికారి షబ్బీర్‌అహ్మద్, సభ్యులు పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.4.32 లక్షలు

అనంతపురంరూరల్, జనవరి 28: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.4,32,390 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,57,150, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,75,240 ఆదాయం వచ్చిందని తెలిపారు.

గడ్డివామి దగ్ధం

గార్లదిన్నె, జనవరి 28: స్థానిక స్కూల్ సమీపంలో ఆదివారం గడ్డివా మి దగ్ధం కావడంతో రూ. 30 వేలు నష్టం వాటిల్లింది. రాజ రామ్మోహన్ అనే రైతు ఆవుల మేపుకుంటు కుటుంబాన్ని పోషించుకు నేవాడు. ఆవుల మేత కోసం 3 ట్రాక్టర్ల గడ్డి కొనుగోలు చేసి వామి వేశాడు. ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. రాజరామ్మోహన్, స్థానికులు ఆ మంటలను అదుపు చేసేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది.

31న మాదిగల సమ్మేళనం

అనంతపురం సెంట్రల్, జనవరి 28: నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో 31న మాదిగల సమ్మేళన సదస్సును నిర్వహిస్తున్నామని దళిత సంఘం నాయకుడు బంగినాగ ఆదివారం ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలకు అతీతంగా మాదిగలందరూ ఏకమై హక్కుల సాధనకు వేదిక గా ఈ సదస్సును ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలోని మాదిగలు పెద్దఎత్తున తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

మెగా వైద్యశిబిరం

అనంతపురం సెంట్రల్, జనవరి 28: ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కురుగుంటలో నిర్వహించినట్లు ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ తెలిపారు. ఈ శిబిరంలో మానసిక వైద్యనిపుణుడు గురుబాలాజీ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేశారన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రణతి, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు ప్రసాద్ పాల్గొన్నారు.



నార్పలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమావేశం

నార్పల : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 1992 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. అలనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులమంతా కలసి సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు.

ఆత్మకూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-1993 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. అలనాటి ఉపాధ్యాయులు అంకిరెడ్డి, సావిత్రమ్మ, పోతి రెడ్డి, రామాంజనేయులు రెడ్డి, సాయినాథ్, వెంకట్రాముడు, వెంకటేసులును రథంపై ఊరేగించారు. వారిని ఘనంగా సన్మానించారు.



ఆత్మకూరులో...

మార్పు కోరుతున్న ప్రజలు

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి



మహిళలతో జేసీ ప్రభాకర్‌రెడ్డి

పెద్దవడుగూరు, జనవరి28: ప్రజలు వైసీపీ పాలన పట్ల విసిగి వేసారిపోయి, మార్పు కోరుకుంటున్నారని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం వారు చేపట్టిన బస్సుయాత్ర ప్రధాన రహదారుల్లో సాగింది. ప్రభాకర్‌రెడ్డికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. చేనేత కాలనీలో పర్యటించిన ఆయన అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులే తప్ప ప్రస్తుత ప్రభుత్వంలో మచ్చుకైనా ఒక్క అభివృద్ధి పని కూడా లేదని కాలనీ మహిళలు ప్రభాకర్‌రెడ్డికి తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే మండలంలో అభివృద్ధిని పట్టాలు ఎక్కిస్తామని వారికి ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చవ్వా గోపాల్‌రెడ్డి, లీలావతి, కేశవరెడ్డి, కొండూరు కేశవరెడ్డి, ఫుట్లూరు లక్ష్మీకాంత్‌రెడ్డి, గంగరాజు యాదవ్, దివాకర్‌రెడ్డి, ప్రసాద్‌యాదవ్, దస్తగిరి, బాలిరెడ్డి, నాగరాజు, చిరంజీవులు, తిలక్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసంద్రంగా ముగింపు ర్యాలీ

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చేపట్టిన యువచైతన్య బస్సుయాత్ర ముగింపు ర్యాలీ జనసంద్రంగా మారింది. మండలంలో 12రోజులపాటు బస్సుయాత్ర జరిగింది. మండలంలోని 40గ్రామాల నుంచి నాయకులు, ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా మండలకేంద్రానికి తరలివచ్చారు. ర్యాలీలో పాల్గొన్న జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డిలు సైకో పోవాలి సైకిల్ రావాలి అన్న పాటకు స్టెప్పులు వేస్తూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు.



టీడీపీ, జనసేన జెండాలను పట్టిన జేసీ అశ్మిత్‌రెడ్డి

టీడీపీ, జనసేన కలయిక చారిత్రాత్మక అవసరం: కాలవ

కణేకల్లు, జనవరి 28: రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న సైకో జగన్‌ను ఇంటికి సాగనంపడానికి టీడీపీ, జనసేన కలయిక చారిత్రాత్మక అవసరమని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అభిప్రాయ పడ్డారు. మండల కేంద్రంలో ఆదివారం జనసేన పార్టీ నూతన కార్యాలయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంజునాథ్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమావేశంలో కాలవ మాట్లాడుతూ జగన్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభ మైందని, గద్దె దిగడానికి మరో 72 రోజులు మాత్రమే గడువు మిగిలి ఉందన్నారు. ప్రజాతీర్పును ముందుగానే అర్థం చేసుకున్న జగన్ తాను ముఖ్యమంత్రి సీటు నుండి దిగిపోవడానికి సిద్ధంగా ఉన్నట్లు ఈ మధ్య ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడ న్నారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని తాను సీఎం అయినప్పటి నుంచి ప్రతిపక్షాలను అణగదొక్కడమే లక్ష్యంగా పెట్టుకుని ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాడని దుయ్యబట్టారు. త్వరలో ఏర్పాటయ్యే టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ద్వారా జగన్‌కు చక్రవడ్డీతో రిటర్న్ గిఫ్ట్ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇన్ని రోజులు సంపాదించిన సొమ్ముతో విదేశాలకు కూడా వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన ఆరోపించారు. ఇప్పటికే యుద్ధం ప్రారంభమైందని టీడీపీ, జనసేన పార్టీలు బాధ్యతగా పనిచేసి వైసీపీ రహిత ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కాకపోతే ఈ రాష్ట్రాన్ని ఎవరూ కాపాడలేరని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన గుంతకల్లు ఇన్‌చార్జ్ మణికంఠ, స్థానిక టీడీపీ నాయకులు లాలెప్ప, జనసేన కన్వీనర్ రవి, రాము, ఆనంద్, బీటీ రమేష్, కోళకుర్తి సుదర్శన, వేలూరి మరియప్ప, మాబుసాబ్, షేక్‌ముజ్జు, చాంద్‌బాషా, కురుబ నాగరాజు, మారుతి, బాయినేని నవీన్, సలీమ్, ఈరప్ప, జయశీలారెడ్డి, గోపాల్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, వెంకటేశులు, ఎంపీటీసీ నరేంద్ర, షేక్‌హుస్సేన్, వరుణ్, ప్రకాష్‌తో పాటు టీడీపీనాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ

వైసీపీవన్నీ అబద్ధాలే: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్

గుంతకల్లు, జనవరి 28: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మొదలుకుని వైసీపీ నాయకులందరూ అబద్ధాలతో ప్రజలను మభ్యపెడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఉదయం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. జగదీశ్ మాట్లాడుతూ రాగులపాడు వద్ద హంద్రీనీవా నుంచి కాలవను ఏర్పాటు చేయడానికి రూ. 42 కోట్లతో ప్రాజెక్టుకు రూపకల్పన చేసి నిధులను విడుదల చేశానని చెప్పిన సీఎం టెండర్లను కూడా పిలిచి డబ్బివ్వలేదన్నారు. తాజాగా రూ. 20 కోట్లు మంజూరు చేస్తానంటూ ఉరవకొండ సభలో అబద్ధాలు చెప్పాడన్నారు. అలాగే గత జూలై 8న వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతికి కళ్యాణదుర్గంలో బీటీ ప్రాజెక్టుకింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారాల చెల్లింపునకు రూ.208 కోట్లు జమచేస్తున్నట్లు చెప్పాడన్నారు. కానీ ఇంతవరకూ ఆ డబ్బు వచ్చింది లేదన్నారు. గుంతకల్లు నాయకులు కూడా జగన్‌కు తీసిపోలేదన్నారు. పట్టణంలోని ధర్మవరం గేటు వద్ద రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)కి రైల్వే టెండరు పిలవడం తమ గొప్పేనంటూ ప్రచారాలను ఊదరగొట్టారన్నారు. దేశంలోని లెవెల్ క్రాసింగ్‌లను తొలగించే ప్రక్రియను రైల్వే శాఖ చేపట్టిందన్నారు. అందులో భాగంగానే గుంతకల్లులోని డీఎంఎం గేటు వద్ద ఆర్‌యూబీకి నిధులు వచ్చాయన్నారు. ధర్మవరం గేటు వద్ద ఆర్‌యూబీ తగిన ఎత్తులేదని కేవలం 3 మీటర్లు మాత్రమే ఉందన్నారు. దాని వల్ల భారీ వాహనాలు వెళ్లే అవకాశాలుండ వన్నారు. ఇక్కడ ఆర్‌యూబీ నిర్మిస్తే స్థానిక ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. వైసీపీ నాయకులకు చేతనైతే అక్కడ ఫ్లై ఓవర్‌ను నిర్మించాలన్నారు. అలాగే కసాపురం రోడ్డులో సమస్యగా ఉన్న వంతెన వద్ద ఆర్‌ఓబీని నిర్మించి గొప్పలు చెప్పుకోవాలని ఎద్దేవాచేశారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బీ గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, నాయకులు మహమ్మద్ గౌస్, రాము పాల్గొన్నారు.

రాజకీయ వ్యాపారి జగన్ : ఉమా



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 28: వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి సైకో జగన్ రెడ్డి రాజకీయ వ్యాపారవేత్తగా అవతారం ఎత్తాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైకోజగన్ రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ముద్దులు పెడుతూ ఇప్పుడు పిడుగులు గుద్దుతున్నారని మండిపడ్డారు. ఒక్క రోజు ఓటేసిన పాపానికి ప్రజల పాలిట వైసీపీ ప్రభుత్వం శాపంగా మారిందన్నారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో నిరుద్యోగం విలయతాండవం చేస్తోందన్నారు. అవినీతి, అక్రమమే ధ్యేయంగా ఐదేళ్ల వైసీపీ పాలన సాగిందని, ఆ సొమ్మంతా తాడేపల్లి ఖజానాలోకి చేరిందన్నారు. రాష్ట్ర మంత్రి, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే ఉష శ్రీచరణ్ వేల కోట్లు నియోజకవర్గం నుంచి దోచుకుందన్నారు. ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా టీడీపీని అధికారంలోకి తెద్దామా అని ఐదు కోట్ల ఆంధ్ర ప్రజలు ఆత్రుతతో ఎదురుచూస్తున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రా.. కదలిరా.. సభలకు వస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దొడగట్ట నారాయణ, పార్లమెంటు కార్యదర్శి తలారి సత్తి, మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మురళి, పార్లమెంట్ అధికార ప్రతినిధి రామరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి బిక్కి గోవింద రాజులు, తెలుగు యువత కార్యదర్శి విరుపాక్షి, కామక్కపల్లి నాగరాజు, నగేష్ యాదవ్, వడ్డే నాగరాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబే రాష్ట్రానికి సరైన నేత

- మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడు



సమావేశంలో మాట్లాడుతున్న జితేంద్రగౌడు

గుంతకల్లు, జనవరి28: రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడపగలిగే నేత చంద్రబాబు మాత్రమేనని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు పేర్కొన్నారు. పట్టణంలోని 5, 6 వార్డుల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఆరో వార్డు ఇన్‌చార్జి టీ కేశప్ప అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో జితేంద్రగౌడు మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్లలో జగన్ చేసింది కేవలం మాయ, మోసాలేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పేరు చెబితే గుర్తుకు వచ్చేది చంద్రబాబు నాయుడేనన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కుపోయిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్ శ్రీనాథ్‌గౌడు, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, టీ కేశప్ప, హనుమంతు, టీ సుమలత, శివన్న, శివప్ప, శ్రీరాములు, కేసీ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక 5, 6 వార్డులకు చెందిన యువతీ యువకులు దాదాపు 110 మంది జితేంద్రగౌడు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరినవారిలో ఎం పెద్దన్న, ప్రభాకర్, ఎం రవి, ప్రకాశ్, బీ మస్తాన్, రసూల్, తదితరులున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

గుంతకల్లుటౌన్: పట్టణంలోని జితేంద్రగౌడు క్యాంపు కార్యాలయంలో ఆదివారం మండలంలోని పులగుట్టపల్లి గ్రామానికి చెందిన ఆనంద్, శ్రీనివాసులు టీడీపీలో చేరారు. వారికి జితేంద్రగౌడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పులగుట్టపల్లి నాయకులు పాలమల్లికార్జున, వన్నూరప్ప, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

దంపతుల మధ్య గొడవ..తోడల్లుడికి కత్తిపోట్లు



చికిత్స పొందుతున్న రాజన్న

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 28: దంపతుల గొడవలో తలదూర్చి ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురైన సంఘటన ఆదివారం కళ్యాణదుర్గంలోని లిటిల్ రోజస్ స్కూలు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు సురేంద్ర, సరస్వతి దంపతుల మధ్య కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సరస్వతి తన అక్క సుకన్య, బావ రాజన్నలను ఇంటికి పిలిపించుకుంది. భార్యభర్తలు సురేంద్ర, సరస్వతిల మధ్య గొడవ జరిగింది. ఆవేశంతో సరస్వతిపై భర్త సురేంద్ర కత్తితో దాడికి యత్నించాడు. గొడవను ఆపేందుకు తోడల్లుడైన రాజన్న అడ్డు వచ్చాడు. ఈక్రమంలో రాజనప్పపై సురేంద్ర కత్తితో దాడి చేశాడు. దీంతో రాజన్న గుండె కింది భాగంలో కత్తిపోట్లు పడ్డాయి. కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించాలని సూచించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడు సురేంద్ర కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలని చంద్రబాబుకు వినతి

ఉరవకొండ, జనవరి28: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఏపీసీపీఎస్‌ఏ జిల్లా అదనపు కార్యదర్శి శర్మాష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యుగంధర్ కోరారు. రా.. కదలిరా.. కార్యక్రమానికి విచ్చేసిన చంద్రబాబు నాయుడు బస చేసిన ప్రాంతంలో ఆదివారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేసి మూడు లక్షల మంది సీపీఎస్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపాలని చంద్రబాబుకు విన్నవించారు.

మీరే మాకు న్యాయం చేయాలి: అంగన్‌వాడీలు

మీరే న్యాయం చేయాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రబాబు నాయుడును కోరారు. 40రోజులుగా ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అధికారంలోకి రాగానే చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్ వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు ధనలక్ష్మి, జ్యోతి, నాగరత్న, ఝాన్సీ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన టీడీపీ నాయకులు



చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, జనవరి 28: జిల్లాకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును పలువురు నాయకులు ఆదివారం ఉదయం కలిశారు. ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, జిల్లా ఉపాధ్యక్షులు రేగాటి నాగరాజు పాటు టీడీపీ నాయకులు తిమ్మప్ప, వేల్పుల శ్రీనివాసులు, వాల్మీకి శ్రీనివాసులు, దండా ప్రసాద్, వజ్రకరూరు మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

షర్మిల పర్యటనకు వెళ్లిన కాంగ్రెస్ నాయకులు



షర్మిల సభకు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు

రాయదుర్గం రూరల్, జనవరి 28: జిల్లా కేంద్రంలో పీసీసీ చీఫ్ షర్మిల పర్యటన సందర్భంగా నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లినట్లు రాష్ట్ర పీసీసీ సభ్యులు వడ్డే చిన్నప్పయ్య పేర్కొన్నారు. నియోజకవర్గం నుంచి 40 వాహనాలలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమం మరింతగా ప్రజలకు ఇస్తామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో అగ్ని ప్రమాదం



కాలిపోతున్న పెంకుటిల్లు

కళ్యాణదుర్గం, జనవరి 28: పట్టణంలోని సాయిబాబా దేవాలయ సమీపంలో నాగార్జున అనే వ్యక్తి ఇంట్లో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. బాధితుడు తెలిపిన మేరకు... నాగార్జున ఇంటి బయట కోతులు విద్యుత్ తీగలను లాగడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో మంటలు చెలరేగినట్లు తెలిపాడు. దట్టమైన పొగలు వ్యాపించడంతో సమీపంలోని కాలనీవాళ్లు గమనించి అగ్నిప్రమాద కేంద్రానికి సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ. 3.5 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



జయంతి సభలో మాట్లాడుతున్న దృశ్యం

కుందుర్పి, జనవరి 28: మండలంలోని బండమీదపల్లి గ్రామంలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా మహిళలు శ్రీకృష్ణదేవరాయల చిత్రపటంతో, బోనాలతో గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీకృష్ణదేవరాయల విశిష్టతను పలువురు వివరించారు. కార్యక్రమంలో బలిజ కుల పెద్దలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బెళుగుప్ప, జనవరి 28: స్థానిక శ్రీనివాస విద్యానికేతన్‌లో ఆదివారం అనంతపురం రియా ఆస్పత్రి ఎండీ లక్ష్మీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్లు ఉదయ్‌కుమార్, గీతాకృష్ణ, కేశవమూర్తి, శివ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీఈవో మురళీకృష్ణ, ఆవులెన్న సర్పంచ్ రాము, నారాయణ స్వామి, తగ్గుపర్తి రాధాకృష్ణ, పెద్దతిప్పయ్య, జయప్ప, బాలాజీ, దబ్బర లక్ష్మీనారాయణ, గోవర్ధన్, బన్ని ఆవులెన్న యర్రిస్వామి, రామసుబ్బయ్య, సుబ్బన్న, మనోహర్, సునిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. తమ ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రజలకు ఉచితంగా వైద్యసేవలందించాలన్న ఉద్దేశంతో వైద్యశిబిరాన్ని నిర్వహించి సేవలందిస్తున్నట్లు ఎండీ తెలిపారు.

ఇది అసమర్థ ప్రభుత్వం: బీజేపీ



మురుగు కాలువను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

డీ.హీరేహాళ్, జనవరి 28: గ్రామాలలో కనీసం తాగు నీరు, డ్రైనేజీ సమస్యలను కూడా తీర్చలేని దుర్భరస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి తిమ్మారెడ్డి మండిపడ్డారు. మండలంలోని పులకుర్తి గ్రామ పంచాయతీ వసగుడ్డం గ్రామంలో ఆదివారం వారు పర్యటించారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య అధికంగా ఉందని ప్రజలు తమ దృష్టికి తేవడంతో ఈ పర్యటన చేపట్టినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు కావస్తున్న గ్రామంలో ఎక్కడా ఒక సిమెంట్ రోడ్డు గాని డ్రైనేజీ గానీ నిర్మించిన పాపాన పోలేదని మండిపడ్డారు.

ఒలింపియాడ్‌లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులను అందుకుంటున్న విద్యార్థులు

గుంతకల్లు టౌన్, జనవరి 28: స్థానిక భాగ్యనగర్‌లోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఐఐటీ సాట్ ఇంటర్ స్టేట్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ చిత్ర ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ అభయాస్ అకాడమీ నిర్వహించిన ఆ పరీక్షలను అనంతపురంలో 2023 డిసెంబరులో నిర్వహించారన్నారు. ఇందులో 5వ తరగతి చదువుతున్న మనోహర సాయి, 7వ తరగతి చదువుతున్న దేవేంద్రసింగ్, 9వ తరగతి చదువుతున్న సలోనికుమారి, 8వ తరగతి చదువుతున్న సాయి అమూల్య, 6వ తరగతి చదువుతున్న సందీప్‌మీనా, 7వ తరగతి చదువుతున్న ధనుష్ కుమార్ మొదటి, రెండు, మూడో ర్యాంకులు సాధించి ప్రతిభ కనబరిచారన్నారు. శుక్రవారం విశాఖపట్నంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారన్నారు.

చంద్రబాబును కలిసిన బీఎస్

గుంతకల్లుటౌన్, జనవరి 28: ఉరవకొండలో రా కదిలిరా బహిరంగ సభకు విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును హెలిప్యాడ్ వద్ద టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి ఆదివారకలిశారు. చంద్రబాబును శాలువతో సత్కరించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని చంద్రబాబు సూచించినట్లు కృష్ణారెడ్డి తెలిపారు.

120 మామిడి మొక్కలపై యాసిడ్

పెద్దవడుగూరు, జనవరి 28: మండలంలోని వీరన్నపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రెడ్డప్ప సాగుచేసిన ఏడాది వయస్సుగల 120 మామిడిమొక్కలపై విషపు యాసిడ్ పోయడంతో ఎండిపోయాయి. ఇదే గ్రామానికి చెందిన గోపాలు, వెంకటస్వామి, లక్ష్మీదేవిలు ఈ చర్యకు పాల్పడినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

కుందుర్పి, జనవరి 28: మండలంలోని బండమీదపల్లి గ్రామానికి చెందిన మణెమ్మ (38) పాము కాటుతో ఆదివారం మృతి చెందింది. మణెమ్మ కుటుంబం చిన్న వ్యాపారం చేస్తూ జీవించేది. తన ఇంట్లోనే పాముకాటుకు గురికావడంతో కుందుర్పి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు. అక్కడ పాటు కాటుకు టీకాలు లేకపోవడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, భర్త ఉన్నారు.

వ్యవసాయ తోటలో పైపుల ధ్వంసం

యాడికి, జనవరి 28: మండలంలోని పెద్దపేట గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో రూ.1.50లక్షల విలువగల డ్రిప్పుపైపులు, ల్యాటర్ దగ్ధమయ్యాయి. బాధిత రైతు వెంకటరమణప్ప తెలిపిన మేరకు.. పెద్దపేట గ్రామం వద్ద సబ్‌స్టేషన్ వెనుక భాగాన తన ఐదెకరాల వ్యవసాయపొలంలో వివిధ రకాల పంటలు సాగుచేసేవాడినని తెలిపారు. పంట విరామం ఉండటంతో పైపులన్నింటిని ఒకచోట ఉంచాన్నారు. ల్యాటర్ అంతా పొలంలో అలాగే ఉందని తెలిపారు. రెండురోజులక్రితం పొలం వద్దకు వెళ్లి పరిశీలించి వచ్చినట్లు తెలిపారు. ఆదివారం పొలం వద్దకు వెళ్లి చూడగా పైపులు, ల్యాటర్ అంతా కాలిపోయి ఉన్నాయని తెలిపారు. సుమారు రూ.1.50లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతు తెలిపారు.

ముగ్గురు ఎస్‌ఐల నియామకం

రాయదుర్గం, జనవరి 28: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాయదుర్గం నియోజకవర్గంలోని వివిధ స్టేషన్‌లకు ముగ్గురు ఎస్‌ఐలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాయదుర్గం అర్బన్ ఎస్‌ఐగా జీడీవీ రమణ, బొమ్మనహాళ్ ఎస్‌ఐగా వీ శ్రీనివాసులు, గుమ్మఘట్ట ఎస్‌ఐగా ఎంఎం వెంకటేశ్వర్లును నియమించారు.

మహిళ అదృశ్యం

పుట్లూరు, జనవరి 28: మండలంలోని కోమటికుంట్ల గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. రమీజాబి వారం రోజులక్రితం ఇంటిలో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. పలు ప్రాంతాల్లో వెతికినా కనిపించక పోవడంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పుట్లూరు ఎస్‌ఐగా హేమాద్రి

పుట్లూరు, జనవరి28: మండల ఎస్‌ఐగా హేమాద్రిని నియమించారు. ఈయన ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి బదిలీపై మండలానికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ దిలీప్‌కుమార్ బదిలీపై అనంతపురం ట్రాఫిక్ ఎస్‌ఐగా వెళ్లనున్నారు.

యువతి ఆత్మహత్య

కణేకల్లు, జనవరి 28: మండలంలోని నల్లంపల్లి గ్రామానికి చెందిన మౌనిక(17) ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు తెలిపారు. కర్ణాటకలోని సంజీవరాయునికోటకు చెందిన శంభులింగ కుమార్తె మౌనిక వారి బంధువులైన నల్లంపల్లి వన్నూరుస్వామి ఇంట్లో గత 15 రోజులుగా ఉంటోంది. చిన్నప్పుడే మౌనిక తల్లి చనిపోగా తండ్రితో పాటు బంధువులు బెంగుళూరుకు వలస వెళ్లడంతో ఒంటరిగా ఫీలైన మౌనిక ఆదివారం నల్లంపల్లి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుం ది. ఈ విషయంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కత్తితో దాడి: ఒకరికి గాయాలు

తాడిపత్రిటౌన్, జనవరి28: మండలంలోని చుక్కలూరు గ్రామానికి చెందిన జయరాంపై ఆదివారం ఇదే గ్రామానికి చెందిన సంతోష్, నవీన్‌లు కత్తితో దాడిచేసి గాయపరిచారని రూరల్ పోలీసులు తెలిపారు. కొంతకాలం క్రితం నవీన్ తండ్రి చంద్ర, జయరాంలు గ్రామంలోని గుడి విషయంలో ఘర్షణపడ్డారు. ఇది గుర్తుపెట్టుకున్న నవీన్ తన స్నేహితుడు సంతోష్‌తో కలిసి ఆదివారం జయరాంపై కత్తితో దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కణేకల్లు, జనవరి 28: మండలంలోని పూలచెర్ల ఉన్నత పాఠశాలలో 2003-04 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులు మంజునాథరెడ్డి, భరత్ ఆధ్వర్యంలో సమేళనాన్ని ఏర్పాటు చేసి నాటి ఉపాధ్యాయులైన సోమశేఖర్, తిప్పేస్వామి, కిష్టప్ప, శివ, నాగిరెడ్డి, గోవిందరాజులు, సురేష్‌బాబు, వెంకటేశులు, లక్ష్మీదేవి తదితరులను సన్మానించారు. దాదాపు 20 ఏళ్ల తరువాత కలుసుకున్న వారు పాఠశాలలో గడిపిన క్షణాలను గుర్తు చేసుకున్నారు.

ప్రతిభను వెలికి తీయడానికే పరీక్షలు



టాలెంట్ టెస్టుకు హాజరైన విద్యార్థులు

కుందుర్పి, జనవరి 28: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికే టాలెంట్ టెస్టు నిర్వహించినట్లు ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు, వదాన్య జన సొసైటీ వ్యవస్థాపకులు అశోక్ ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ జ్ఞాపకార్థం పోటీపరీక్షలు నిర్వహించామని తెలిపారు. మండల వ్యాప్తంగా నిర్వహించిన ఈ టెస్టులో కుందుర్పి ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి చదువుతున్న 700 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. దీంతో పాఠశాల ప్రాంగణమంతా కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు ఓబుళపతి, తిప్పేస్వామి, ప్రధానోపాధ్యాయులు కిష్టప్ప, వైద్య సిబ్బంది, ప్రముఖ సేవా తత్పరులు కంబాల తిమ్మారెడ్డి, ప్రముఖ సాహితీవేత్త ఆది ఆంధ్ర తిప్పేస్వామి, ఏపీటీఎఫ్ జిల్లా ఆర్థిక కార్యదర్శి క్రిష్ణమూర్తి, ఎస్టీయు నాయకులు రాజు, రేవణ్ణ, సుబ్బరామప్ప, తదితర ప్రభుత్వ ఉపాధ్యాయులు, రాధాస్వామి స్కూలు కరెస్పాండెంట్ రాజు, ఉపాధ్యాయులు, విలువల బడి కోఆర్డినేటర్లు లక్ష్మణ మూర్తి, బొమ్మలింగ, శ్రీకాంత్, దిలీప్, విలువలబడి ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్ల కోసమే ఆరోపణలు

బొమ్మనహాళ్, జనవరి 28: మండలంలోని నేమకల్లు శివారు కొండల్లో కంకర తయారు చేస్తున్న క్రషర్ల యజమానుల నుంచి అక్రమ వసూళ్లు చేసుకునేందుకు వైసీపీ సర్పంచ్ పరమేష్ తెరలేపాడని ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గాలి బసప్ప, డొణెప్ప, గాదిలింగ ఆరోపించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి చెందిన క్వారీలో పరిమితికి మించి బ్లాస్టింగ్, అక్రమ తవ్వకాలు జరిగినా పట్టించుకోని సర్పంచ్ పరమేష్ ఇప్పుడు నిబంధనల ప్రకారం జరుగుతున్న వాటిపై తప్పుడు ప్రకటనలు చేస్తున్నాడని విమర్శించారు. సర్పంచ్ పరమేష్‌కు ధైర్యముంటే కాపు రామచంద్రారెడ్డికి చెందిన క్వారీపై స్పందించాలన్నారు.